# చెప్పుగుండీలు

శ్రీ రాగి



సీతారాంను గురించి ముందుగా మీకు కొంచెం వివరించట మవసరం. అతను దబ్బపండు ఛాయలో, అంత ఎత్తుగాకుండా, పొట్టిగాకుండా వుంటాడు. వయస్సు నలభై ఏళ్ళపైమాటే. అంత అందగాడని చెప్పలేంగానీ, అనాకారి మటుకుగాడు. మనిషి భలే చురుకుగా వుంటాడెప్పుడూ. ఏ విషయం మీదనైనా అతను చెపుతుంటే వినాలి. శ్రోతలను తనవైపు ఎంతో తేలికగా ఆకర్షించుకొంటాడు. అతను చెప్పేదంతా మనం కాదనలేము, అవుననకుండా వుండలేము. ఆ చెప్పటంలో ఎంత చమత్కారంగా చెప్తాడని! ఎంత తమాషాగా ఇతరుల పాత్రలను అభినయిస్తాడని! మనం అతనితో కొన్నిసార్లు మాట్లాడిన తర్వాత, అతనికి రాని విషయం, అతను మాట్లాడని విషయం ఏదన్నా వుందా అని ఆశ్చర్యపడక తప్పదు. అటువంటి ధోరణి అతనిది.

ఉద్యోగరీత్యా అతను నర్సువృత్తి నవలంబించాడు. ఆ వృత్తిలో అతను మేధావి అని చెప్ప నవసరం లేదనుకుంటాను. వైద్యంలో దేనివి గురించయినా అతను చెప్తుంటే, దాంట్లో ఆయన డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణుడై ప్రాక్టీసు చేస్తున్న వైద్యునికంటెకూడా గొప్పవాడేమో నవిపించటంలో ఆశ్చర్యంలేదు.

అతన్ని గురించి చెప్పాలంటే ఎన్ని వందల పేజీలయినా అవలీలగా వ్రాసుకుపోవచ్చు. కాని అతను నా కొకసారి ఉటంకించిన ఓ చిన్న సంఘటనను గురించి మాత్రం వివరిస్తాను. అది మద్రాసులో జరిగింది. సీతారాంకు పాపం నలుగురు పుత్రికా రత్నాలున్నారు. ఆయన సతీమణి అయిదోకాన్పుకు ఓ పుత్ర రత్నాన్ని కన్నదనుకోండి. కాని అతను పెరిగి పెద్దై, సంపాదించి తనకు పెట్టే సమయానికి తనసలు వుంటాడా అని, అంటూండేవాడు సీతారాం. నలుగురూ ఏవో క్లాసులు చదువుతున్నారనుకోండి. అందులో అతని పెద్ద కూతురు పెరిగి పెద్దదై, వివాహానికి సిద్ధంగావుంది. ఆ వివాహం అయిందనిపించుకొని తన బాధ్యత నిర్వర్తించుకుని చేతులు కడుక్కుందామని సీతారాం తాపత్రయం. మద్రాసు పట్టణంలో ఏదో సంబంధం వున్నదంటే, ఉదయమే లేచి ఆరుగంటల రైలు బండిలోఎక్కి మద్రాసు పదిగంటలకల్లా చేరాడు.

వెళ్ళేది పెళ్ళి సంబరాధాలకు గనుక, కొంచెం డాబుసరి దుస్తులే ధరించాలని సీతారాం అభిప్రాయపడ్డాడు. అది చలికాలం కావటం వల్ల, ఆయన తనకున్న ఉన్ని ప్యాంటూ, కోటు ధరించి, చెప్పులు వేసుకొన్నాడు. నిజానికి ఆయనకు బూట్లు వున్నాయి, కాని తను వెళ్ళేది పెళ్ళి సంబంధాలకు గనుక, తను పెద్ద మనిషిగా కనపడాలి గనుక (ఆయన పెద్దమనిషి కాదనుకునేరు! ఆయన పదహారణాల పెద్దమనిషి!) చెప్పులు వేసుకొంటే బాగుంటుందనుకున్నాడు. నల్లకళ్ళజోడు వుండనేవుందనుకోండి. అసలు పేచీ వచ్చిందంతా ఇప్పుడు చెప్పులతోనే.

ఆ చెప్పులు ఒకసారి మా యింటికొచ్చినప్పుడాయన చూపించాడు. గోధుమ రంగులో తళతళలాడుతూ వున్నాయి. వాటిమీద స్టెయిన్‌లెస్ బటన్లు తెల్లగా, నున్నగా, మెత్తగా, మెరుస్తూ కనిపించాయి. "ఆ గుండీలు బావున్నయ్యండీ!" అన్నా. ఆయన నవ్వి "వాటికి బోలెడు కథ వుంది, ఓపికగా వినండి. చెప్తాను" అంటూ ఈ వివరించబోయే ఉదంతమంతా చెప్పాడు. మధ్య మధ్య ఆయన ప్రకటించిన హావభావాలు చూసి నవ్వలేక చచ్చామనుకోండి నేనూ, మా వాళ్ళూను. ఆ గుండీల వుదంతం తను సాధించిన కార్యాల్లో ఒకటిగా ఆయన అభివర్ణిస్తుంటె ఎంతటి వాళ్ళకయినా, పొట్ట చెక్కలు గాకుండా వుండాలంటె కష్టమేమరి!

అలా ఆ అందమైన చెప్పులు వేసుకొని రైల్లో ఎక్కాడా మరి, ఆయన ఖర్మకాలి, రైల్లోనే ఒకకాలి చెప్పు బొటనవ్రేలి దగ్గర కుట్టు తెగింది. పాపం, కుంటుకుంటూ, కుంటుకుంటూ (ఆ చెప్పు పూర్తిగా ఎక్కడ తెగిపోతుందోనని!) అలాగే రైలుదిగి మూర్ మార్కెట్ దాకా నడిచివెళ్ళాడు. ఎందుకంటే దానిని బాగుచేయించడానికి అంతకంటే మంచి ప్రదేశంలేదు. సరే, ఆయన మూర్‌మార్కెట్‌లో చాలా కొట్లుతిరిగాడు ఎక్కడిస్తే బాగుంటుందా అని. ఓ చెప్పులకొట్లో ఓ ఆడమనిషి పనిచేస్తున్నది. చూడటానికి మరీ అసహ్యంగాలేదు. ఆమె కొట్లోకి పోయి సీతారాం నిలబడ్డాడు.

"ఏం కావాలండీ?" అడిగింది షాపులో ఆమె.

"ఇదిగో, ఈ చెప్పు కుట్టుతెగింది. కొంచెం కుట్టిస్తావా?" అన్నాడు సీతారాం, అతి మర్యాదస్తుడిగా.

ఆమె, సీతారాం ముఖకవళికలనుబట్టి తెలుగువాడు అని భావించి, తెలుగులో మాట్లాడటంచేత సీతారాం తెలుగులోనే సమాధానం చెప్పాడు. నిజానికి సీతారాంతల్లి దండ్రులు తమిళ దేశస్థులు. సీతారాం తమిళదేశంలోనే పుట్టాడు అక్కడే పెరిగాడు. ఉద్యోగరీత్యా ఇరవై సంవత్సరాల నుంచీ తెలుగుదేశంలో వుండడంచేత అతని వేష భాషలు తెలుగువాడిని పోలివుండటంలో ఆశ్చర్యం ఏమిటి? అతను తమిళుడనీ, అతనికి అరవం తెలుసనీ అభిప్రాయపడటానికి అవకాశాలు ఏకోశానా వుండవు.

సీతారాం ఇచ్చినచెప్పును, వైద్యుడు రోగిని పరీక్ష చేసినట్లుగా పరీక్షచేసింది షాపులో యువతి.

"దీని కిక్కడ స్టెయిన్‌లెస్‌స్టీల్ బటను కొట్టాలండీ!" అందామె చివరకు, డాక్టరు రోగజబ్బును గురించి నిర్ధారణకు వచ్చినట్లుగా.

"సరే కొట్టమ్మా!" అన్నాడు సీతారాం.

వెధవ "బటన్" ఎంతవుంటుంది గనుకా, కొట్టాక ఓ ఇరవై పైసలో, పావలాబిళ్ళో చేతిలో పెడితే సరిపోతుందిలే అనుకున్నాడు సీతారాం పాపం!

ఆమె చెప్పు బొటనవ్రేలి దగ్గర తెల్లటి బటన్ కొట్టి చెప్పును సరిచేసి ముందుకు తోస్తూ "రెండు చెప్పులకీ మొత్తం స్టీలుబటనులుకొడితే అందంగా వుంటాయండీ" అన్నది.

సీతారాం బటన్‌వంక చూశాడు. చందమామలా తెల్లగా, నిగనిగ లాడుతూ, అందంగా ముద్దొస్తున్నది. ఆ అందమైన బటన్లు రెండు చెప్పులకీ కొట్టిస్తే బాగుంటుంది అనుకున్నాడు.

"ఎన్ని బటన్లు కావాలి?" అన్నాడు.

"ఎన్నండీ, చెప్పుకు ఏడు బటన్లు, రెంటికీ పధ్నాలుగు సరిపోతయి"

"అప్పుడు చెప్పులు మరింత అందంగా వుంటాయంటావా?"

"అందంగా వుండటమేకాదు, రెండు సంవత్సరాలదాకా కూడా చెప్పులు వాడుకోవచ్చు చెక్కు చెదరకుండా!"

సీతారాంకు కొంచెం ఆశపుట్టిన మాట నిజం. అయిదు రూపాయలకు కొన్న చెప్పులు రెండు సంవత్సరాలు వాడగలిగా డంటె ఎంతగొప్ప! ఎంత ఆదా!! వెధవ బటన్లు ఎంతవుతాయి గనుక, రెండు చెప్పులకీ ఇప్పుడే వేయించేస్తే పోతుంది.

సీతారాం నాలిక నోటి చివరిదాకా వచ్చింది "బటను ఖరీదెంత?" అని అడుగుదామని. కాని అలా అడగటం తన గౌరవానికి భంగమని తోచింది సీతారాంకు. తనేమిటి, తనహోదా ఏమిటి?

"ఈ బటన్లు ఇంకెక్కడా దొరకవండీ. మీకు కాబట్టి కొడుతున్నాను?" అందామె సీతారాంను ఏదో వుద్ధరిస్తున్నట్లుగా.

సీతారాం తనలో తనే ఉప్పొంగిపోయాడు ఆ చెప్పులు బాగుచేసే యువతి తన కిస్తున్న గౌరవానికి.

ఆమె రెండే రెండు నిమిషాలలో రెండు చెప్పులకీ బటన్లు సుత్తి తీసుకొని కొట్టేసింది, చెప్పులిప్పుడు వాటితో తళతళ లాడుతున్నాయి.

సంతోషంగా చెప్పులు తొడిగాడు సీతారాం. కోటుజేబులో చెయ్యిపెట్టి పర్సు తీస్తూ "ఎంత?" అన్నాడు.

"బటన్ ముప్పయి ఐదు పైసలు..." ఆమె ఇంకా ముగించలేదు

"ఆఁ..." అన్నాడు నోరు తెరుచుకొని సీతారాం

సీతారాం గాభరా చూసి చెప్పులు కొట్టామె మెల్లగా నవ్వింది

"అంత గాభరా ఎందుకండీ? బటన్లు చూశారా? ఎంత నున్నగా తెల్లగా, తళ తళ లాడుతూ అందంగా వున్నాయో!

అవి స్టెయిన్‌లెస్ స్టీలుతో చేసిన బటన్లండీ. అసలు ఇంకొకరికయితే నలభై పైసలకు వయా

## చెప్పు గుండీలు

పైస తక్కువ యివ్వం. మీరేమో పెద్దమనిషి లాగున్నారని అయిదు పైసలు తగ్గించాం... ఛలేవారే"! అన్నదామె నవ్వుతూ.

విస్తాంతపోయాడు సీతారాం.

"బాబోయ్! బ...ట...ను...ఒ..క్క...టీ ముప్పయి బదు పైసలా?" "నొక్కి నొక్కి అన్నాడు సీతారాం.

"అవునండీ, అదీ మీరు గనుక!"

"బావుంది...బావుంది..." గొణిగాడు సీతారాం.

"పథ్నాలుగు బటన్లూ నాలుగు రూపాయల డెంభై పైసలు. వాటిని కుట్టినందుకు కూలి రూపాయి మొత్తం అయిదు రూపాయల డెంభై పైసలివ్వండి" అన్నదా చెప్పులకొట్టామె.

"అమ్మ బాబోయ్! ఏమంత పిడూరంగా చెప్తున్నావు?" కొంచెం ఓపిక తెచ్చుకొని గట్టిగా అన్నాడు సీతారాం.

"పిడ్డూర మేమిటండీ? కావాలంటే, అడుగో వాడి నడగండి..." అంటూ అప్పుడే కొట్లోకి వచ్చిన ఓ ఇరవై యేళ్ళ కుర్రాణ్ణి చూపించింది.

"ఏమిటీ..?' అన్నాడు వాడు.

"ఈ బటన్ల ఖరీదెంతరా?" అన్నది చెప్పులకు కొట్టిన బటన్లు చూపిస్తూ.

"అవా! వాటి ఖరీదు ఒక్కొక్కటి ముప్పయి బదు పైసలు..." చాలా తేలికగా అన్నాడు వాడు.

"WHEN NATURE FAILS"
పొడుగు పెరగండి
(2 అం. నించి 6 అం. వరకు గ్యారంటీ)
ప్రపంచ ప్రఖ్యాతిపొందిన మా"హైటెక్స్'
Hytex ఔషధం ఉపయోగించి మీరు గ్యారంటీగా 2 నుంచి 6అంగుళములవరకు పొడుగుపెరగగలరు. ఏ వయస్సులోవున్నా పరవాలేదు. స్త్రీ.పురుషులు పుచ్చుకోవచ్చు ఒకఫియల్ వెల (20Tabs) రూ. 3-75 పోస్టేజి అదనం.
తెల్ల జుట్టును పోగొట్టి యవ్వనవంతులుగాచేసే ఈతైలం మరెక్కడా దొరకదు.
మా నిరపాయకరమైన సువాసనగల 'బాల్‌కాలా తేల్'(BAL KALA TEL) తెల్ల వెంట్రుకలు శాశ్వతంగాప్రేళ్ళతోసహా నల్లబడేలా చేస్తుంది. ఒకఫియల్ వెలరూ. 3-00p.పోస్టేజిఅదనం3ఫియల్స్ వెలరూ. 7-50p ఉత్తరములుఆంగ్లంలోవ్రాయండి
d/, UNITED COMMERCIAL CO.
(Best No. 29 A.W.V/8
Flat Door NO. 3883
AMBALA CANTT N. India

"అలా చెప్పరా వారికి! విన్నారా బాబూ?" అన్నదా చెప్పులు బాగుచేసే యువతి.

సీతారాంకు వళ్ళు మండింది. బోడి వెధవ! వీడి సపోర్టేమిటి మధ్య?

సీతారాంకు యేమీ తోచలేదు. వీళ్ళు తన దుస్తులను చూసి వట్టి డాంబికుడిగా, అమాయకపు పెద్ద మనిషిగా లెఖ్ఖ గడుతున్నట్టుంది. వీళ్ళకి తన తడాఖా ఏమిటో చూపించాలి

"ఏమమ్మోయి! తమాషాగా మాట్లాడుతున్నావు! నేనేం పల్లెటూరి రైతు ననుకున్నావా? నీ పప్పులు నా దగ్గరేం వుడకవు. అంత తేలికగా బుట్టలో పడేవాడిని కాదమ్మోయి. నాకేం అరవం రాదనుకొన్నావా! నీ కన్నా బా స్తిగా మాట్లాడతా..."

"అయితే మీ రనే దేమిటండీ!" కొంచెం రెట్టించింది కొట్లో యువతి.

ఈ కొట్లో గల్లంతుకు చుట్టు ప్రక్కల కొట్లల్లోవాళ్ళూ, కొనుక్కోటానికి వచ్చినవాళ్ళూ వీళ్ళ చుట్టూ గుంపు గూడారు. సీతారాం వాళ్ళందరినీ ఉద్దేశించి యిలా అన్నాడు.

"దూరాలండీ ఈ అన్యాయం! బటను ఖరీదు ముప్పయి బదు పైసలట! పథ్నాలుగు బటన్లు వేసిందో లేదో అయిదు రూపాయల డెంభై పైసలు యియ్యమంటున్నది! ఇదేమన్నా బాగుందా!"

"అయితే మీరనేదేమిటో చెప్ప రాదూ?" అన్నాడు. అక్కడ చేరిన గుంపులో పెద్ద మనిషిగా కనబడుతున్న ఒకడు.

"ఏముందీ? ఈ చెప్పుల అసలు ఖరీదు అయిదు రూపాయలు. అదిగో ఆ దూరంగా కనబడుతున్న చెప్పుల కొట్లోనే క్రిందటి నెల కొన్నాను. కావాలంటె అక్కడ కనుక్కోండి కొన్నానో లేదో!" అన్నాడు సీతారాం.

"అయితే ఇంకేం! అయిదు రూపాయల చెప్పులకి బటన్ల ఖరీదు అయిదు రూపాయల డెంభై పైసలు. తప్పేముందీ! ఇచ్చుకోండి" అన్నాడో కొక్కిరాయి ఆ గుంపులో నుంచి.

అక్కడ చేరిన జనమంతా ఘొల్లుమన్నారు, కొట్లోయువతి నోటికి చెయ్యడ్డం పెట్టుకుని నవ్వింది. సీతారాంకు వళ్ళంతా కారం చల్లినట్లయింది, ఎవడా కొక్కిరాయివెధవ! మ్రింగేయా లనిపించింది. కాని ఎలా?

కాసేపటికి ధైర్యంతెచ్చుకుని ఇలా అన్నాడు.

"ఈ బటన్లు వేసినందుకు అయిదు రూపాయల డెంభై పైసలు చస్తే యివ్వను. బటనుకు పది పైసలూ. బాగుచేసినందుకు పావలా, మొత్తం రూపాయి అరవై అయిదు పైసలిస్తాను, అంతకు మించి నయాపైస యివ్వను, తెలిసిందా?"

"బావుంది బటన్లు కొట్టేశాక యిప్పుడివ్వనంటె ఎలా? ఆమాట ముందే అనాల్సింది" అన్నది చెప్పుల కొట్టామె,

"ధర ముందుగా చెప్పాల్సిన బాధ్యత నీది కాదూ?"

"నాకేం తెలుసు. నువ్వో పెద్దమనిషివని, ధర చెప్పకుండానే కొట్టాను. నువ్విలా బేరం చేస్తావని తెలుస్తే అసలు నీవనె ఎత్తుకునే దాన్ని కాదు."

"ఏవమ్మోయిమాటలుజాగ్రత్తగా రానియి?"

"మాటలెందుకు? నా డబ్బులిచ్చి చెప్పులు తీసుకుపో!"

"కొట్టిన గుండీలూడబెరికి నా చెప్పులిచ్చెయ్యి!"

"అదేం కుదరదు!"

"అయితే చెప్పులు నీ దగ్గరే వుంచుకో. వాటి ఖరీదు అయిదు రూపాయలు. ఓ నెల వాడుకున్నాను గనుక రెండు రూపాయలు తీసేసి మూడురూపాయలివ్వు!"

"బలేబేరం! బలేబేరం!" అక్కడ చేరిన వాళ్ళల్లో ఎవడో పెద్దగా అన్నాడు.

వాళ్లుఅంతా ఘొల్లుమన్నారు?

సీతారాం తల కొట్టేసినట్లయింది. అయితే తను తగ్గే ఘటమా!

'ఏమంటావు' అన్నాడు తిరిగి కొట్టామె నుద్దేశించి.

"మీ చెప్పులు నా కెందుకయ్యా! చోద్యంగా వుందే!" అన్నదామె.

"అలా అయితే నీ గుండీలు ఎక్కడైనా కొని తెచ్చిస్తాను.అందాక చెప్పులు నీదగ్గరే వుంచు."

అంటూ షాపునుంచి ఉత్తకాళ్ళతో బయటికి నడిచాడు. తన ఖర్మకాలి మద్రాసంతటి మహా నగరంలో తనంతటి పెద్దమనిషి చెప్పులు లేని కాళ్ళతో నడవాల్సి వచ్చింది, ఏం వ్రాత వ్రాశావయ్యా బ్రహ్మదేవుడా! అనుకున్నాడు సీతారాం. కాని తనేం పల్లెటూరిబైతా మూరుమార్కెటులో బోల్తా పడటానికి. ఈవిషయం ఏమిటో తేల్చుకోందే మద్రాసు వదలకూడదు. రాత్రి పొద్దుపోయేదాకా తనకు తిరుగు రైళ్ళున్నాయి. తనపని చూసుకొని ఏక్షణాన్నయినా రైలెక్కచ్చు.

బటన్లకోసం తిరిగాడు చాలా కొట్లు. చాలామంది అలాటి బటన్లు తమదగ్గర లేవన్నారు. కాని సీతారాం పట్టు విడువలేదు. మూరుమార్కెట్టుకు ఫర్లాంగు దూరంలోవున్న ఓ చిన్న దుకాణంలో జొరబడ్డాడు.

"చెప్పులకు వేసే స్టెయిన్ లెస్‌స్టీల్ బటన్లు ఉన్నాయా అండీ?" అడిగాడు దుకాణదారుణ్ణి.

"ఉన్నాయండీ." అన్నాడతను.

పోయిన ప్రాణం లేచి వచ్చింది. సీతారాంకు, 'అమ్మయ్య అనుకున్నాడు.

"చూపించండి" అన్నాడు.

దుకాణదారుడు గుండీలు తీసుకొచ్చి చూపించాడు. సీతారాం వాటిని చేతిలోకి తీసుకొని చూశాడు. అచ్చగా తన చెప్పులకు వేసినవిలాగే

వున్నాయి. అతని మనస్సు సంతోషంతో నిండిపోయింది.

"ఎంతండీ?" అడిగాడు

'డజను అరవై పైసలు! అన్నాడు షాపువాడు. సీతారాం తనచెవులను తనే నమ్మలేకపోయ్యాడు అంటే ఒక్కొక్కటి అయిదు పైసలన్నమాట. వినబడనట్లు నటించి "ఎంతంటున్నారు" అని తిరిగి అడిగాడు.

దుకాణదారు కొంచెం విసుక్కొని "డజను అరవై పైసలండి బాబూ! అంతకు మించి నయాపైస తగ్గదు" అన్నాడు. సీతారాం కిప్పుడు నమ్మకం కుదిరింది. డజను అరవై పైసలంటే ఒక్కొక్కటి అయిదు పైసలన్నమాట. ఐదు పైస లెక్కడ! ముప్ఫయిఐదు పైసలెక్కడ! ఆ చెప్పులకొట్టు మనిషి తన నెంత దగా చేద్దామనుకొంది? తనా దగాపడేది? చివరకు వాటిని అంత చౌకలో సాధించినందుకు తనను తనే మెచ్చుకొన్నాడు తనకు పధ్నాలుగు బటన్లు కావాలి. ఇంకో నాలుగెక్కువ తీసుకుంటే ఆ షాపు దాని మొహాన దర్జాగా కొట్టచ్చు" అనుకున్నాడు సీతారాం.

"పద్దెనిమిది బటన్లు ప్యాక్ చేసి యివ్వండి" అన్నాడు. అన్నవాడు డబ్బులిచ్చి, బటన్లు తీసుకొని గప్‌చిప్‌గా బయట పడొచ్చుగా! ఉహుఁ వుండబట్టలేక ఫలానా షాపామె ఇలా ఇలా చేసింది అంటూ జరిగిందంతా చెప్పాడు నోరు జారి.

ఆ షావతను సీతారాం చేతిలో పెట్టినపొట్లం గభాలున లాక్కొన్నాడు.

"ఏందయ్యా! అలా లాక్కుంటావు?" అన్నాడు సీతారాం గాభరాగా.

"మరేం చెయ్యమంటారండీ" ఆ షాపామెను నే నెరుగుదును, వాళ్లు మా దగ్గరే గుండీలు కొంటారు రోజూ. మీకు ఐదు పైసలకే యిచ్చానని తెలుస్తే నన్ను బ్రతకనిస్తారా? అమ్మ బాబోయి యింకేమయినా వుందా? దయచేసి మీరింకెక్కడయినా కొనుక్కోండి" అన్నాడు.

సీతారాం గుండె గుభేలుమంది.

"అదేంటయ్యా! పిచ్చివాడిలాగున్నావు! నీ దగ్గర కొన్నానని వాళ్లకి చెప్తాననుకున్నావేమిటి? భలేవాడివే! ఆ ప్యాకెటు యిలా యిచ్చెయ్యి" అన్నాడు.

"అమ్మమ్మ! వాళ్లు రౌడీ వెధవలండీ! మా ప్రాణం తీస్తారు" మొండికేశాడు షాపువాడు.

"ఏమయ్యోయి! మర్యాదగా యిస్తావా యియ్యి! లేకపోతే పోలీసు రిపోర్టిస్తాను. తెలిసిందా! ఎంత ఖర్చయినా సరే నీసంగతేమిటో వదలను. అలా ఇలా పోనిచ్చేవాడిని కాదయ్యోయి" అన్నాడు సీతారాం గట్టిగా.

ఇదెక్కడ గొడవచ్చి పడిందిరా భగవంతుడా! అనుకున్నాడు కొట్టువాడు. ఎప్పుడో వాళ్లొచ్చి గొడవ చేస్తారని భయపడితే ఈయన పోలీసు రిపోర్టిస్తానంటున్నాడు. ఏమిటిదారి! అనుకొని ఆఖరికి యిలా అన్నాడు.

"ఏమండోయి, మీరేదో సూటేసుకొని పెద్ద మనుషుల్లా కనపడుతున్నారుగాబట్టి బటన్సు ఇస్తున్నాను. ఎక్కడ కొన్నారండీ అంటే మాత్రం కొంపతీసి నా కొట్టుపేరు చెప్పబోకండి. మీకు దండం పెడతాను"

"సరేలేవయ్యా. నీ షాపులో కొన్నట్టు చెపుతే గదా నీవు భయపడాల్సింది. అవి యిలా పడెయ్యి" అన్నాడు సీతారాం.

ఆ కొట్టువాడు పద్దెనిమిది బటన్లు ప్యాక్ చేసిన పొట్లంయిచ్చి. సీతారాంయిచ్చిన తొంభై పైసలు తీసుకున్నాడు. అదితీసుకొని ఎంతోసాధించినట్లుగా విజయ గర్వంతో, బయటకు నడిచాడు సీతారాం.

'తనుమొదట ఆ కొట్టామె బేరమాడితే రెండు రూపాయలు మొహానకొట్టి బయటపడదామనుకున్నాడు. కాని వెధవది ఐదు రూపాయల తొంభై పైసలు కావాలంటుందా? చూసుకో నా తడాఖా" అనుకున్నాడు సీతారాం.

రోడ్డంబడ నడిచివస్తుంటే సీతారాంకు ఇంకో ఊహ తట్టింది. తనుబటన్లు వక్కా బాటాషాపులో కొన్నట్లు నటించాలి. ఆ 'బాటా' షాపు తను మొదటవెళ్లిన షాపుకు వందగజాల దూరంలో వుంది. తను బాటా షాపునుంచి వస్తున్నట్లు వాళ్ళకు కనపిస్తే చాలు. అందుకని "బాటా" షాపుముందర అయిదు నిమిషాలు తారట్లాడి, తన మొదటి షాపువైపు చూశాడు. అక్కడ నుంచి తననెవరైనా గమనిస్తున్నారేమోనని. ఉహుఁ ఎంత తిప్పలుపడ్డా లాభం లేకపోయింది.

నిరాశతో నేరుగా తన చెప్పులు బాగుచేయించుకున్న షాపుకొచ్చాడు.

"ఇదిగోనమ్మా నీ గుండీలు. తీసుకో!" అంటూ గుండీల ప్యాకెట్టుఆమెముందు పెట్టాడు.

ప్యాకెట్టు విప్పి ఆమె చూసింది. తనువేసిన గుండీలే!

"ఎక్కడ కొన్నారండీ" అతి మర్యాదగా అడిగింది.

"ఇంకెక్కడ కొంటాను, 'బాటా'షాపులోనే"

"ఎంతండీ

"ఎంతయితే నీ కెందుకు? నీగుండీలు నువ్వు తీసుకో. ఇంకోనాలుగు ఎక్కువకూడా వున్నాయి, అవికూడా నువ్వే వుంచుకో. కుట్టినందుకెంతయియ్యమంటావో అడుగు న్యాయంగా"

"ఒక్క రూపాయి ఇయ్యండి బాబూ!" అన్నది షాపులోయువతి తనెటూ నష్టపోయాననే ఆవేదనతో.

"ఇదిగో అర్థ రూపాయిస్తున్నాను, ఇంతకు మించి నయాపైస యివ్వను" అంటూ జేబులో నుంచి వెండి అర్థ రూపాయి ఆమె ముందువడేసి, అక్కడేవున్న తన చెప్పులు తొడుక్కున్నాడు.

ప్యాకెట్టులో వున్న గుండీలలోనుంచి నాలుగు తీసుకొని జేబులోవేసుకొని మరీ బయటపడ్డాడు. మొట్ట మొదట అవి ఆమెకిద్దామనే అనుకున్నాడట. కాని ఆమె రూపాయి అడిగేటప్పటికి కోపమొచ్చి ఆ నాలుగూ తీసుకొన్నాడు. అవి తనకు పనికిరావని. రాకపోవి. అది వేరే సంగతి!

ఈ తతంగమంతా పూర్తయేటప్పటికి రెండు గంటలు పట్టింది. పాపం చెప్పులు బాగుచేసే యువతి సీతారాం మొండిధైర్యానికి నిలువు గుడ్లేసుకొని చూడటంతప్ప యేం చెయ్యలేకపోయింది.

సీతారాం తరువాత తనపని ముగించుకొని ఆ రాత్రే మద్రాసు నుంచి తిరుగు ప్రయాణం చేశాడు. సీతారాం "అంటాడు ఇంకోళ్లయితే అయిదు రూపాయల తొంభై పైసలర్పించి దండం పెట్టి వచ్చేవాళ్లు. తనుగనుక ధైర్యంతో ఎదుర్కొని రూపాయి నలభై పైసలతో వ్యవహారం ముగించానని

సీతారాం ఘటికత్వం గురించి చెప్పాలంటే ఇంతకన్నా ఏం కావాలి?

